
-డా.సి.ఆనందారామం



# విలువైన బహుమతి

అతడు దళపతి. సామంత రాజు లాంటి రాజకీయ నాయకుడికి, సేనా నాయకుడిలాంటి గూండా నాయకుడు... అతడు గళ్ళ లుంగీ కట్టుకోడు. జీన్స్‌లో ఉంటాడు. పాకలో ఉండడు. మంచి డాబా ఇల్లుంది. మాట మనసును బయట పెట్టకపోతే, పెద్దమనిషిగానే చెలామణీ అయిపోతాడు.

అతడి భార్య జయ. భర్త ఆమెని ఏనాడూ గౌరవంగా చూడలేదు. ఆమె మాటకు విలువ ఇవ్వలేదు. దళపతి పట్ల భయంతో ఆమెని చుట్టుపక్కల వాళ్ళు ఆత్మీయంగా ఆహ్వానించరు. పదిమంది సంతానంలో ఒక్కతే కూతురు.

అతడు ఆశల హరివిల్లు అందుకోవటానికి కత్తుల నిచ్చెనలెక్కుతున్నాడు. పిల్లలకోసం ఊపిరి నిలుపుకోవటానికి ప్రయాసపడుతోంది జయ.

ఆ రోజు...

"ఏమన్నావ్?" క్రూరంగా గర్జించాడు దళపతి.

మృత్యువు తప్పదని తెలుసుకున్న సైనికుడు తెగింపు వచ్చింది జయలో. ధైర్యంగా అతడి చూపులను ఎదుర్కొంది.

అతడు గాండ్రిస్తున్నాడు.

'ఫేమిలీ ప్లానింగా? అది నాకెందుకే? ఎంత మంది పిల్లలుంటేనేం? నేను పోషించలేనా? ఇంకో ఇరవై మందిని కంటాను. నా ఇంట్లోనే ముప్పై మంది ఓటర్లు. ముప్పైమంది సైన్యం. మా బాస్ నాకు విలువయిన బహుమతి ఇస్తానన్నాడు. నాకేంటీ?" అహంకారంతో గురగుర లాడుతున్న అతని గొంతు వింటూ,- ఆశలతో మత్తెక్కి ఉన్న అతని కళ్ళలోకి నిర్భయంగా చూస్తూ "నేను కనలేను. మరో కానుపంటే నాకు చావే!" అంది.

"నువ్వు కనకు. నేను కంటాను."

క్రూరంగా చూసాడు. వెక్కిరింపుగా నవ్వాడు. జీపెక్కి వెళ్ళిపోయాడు.

కూతురు తల్లి దగ్గిరగా వచ్చి చుట్టూ చేతులు వేసింది. అప్పటివరకూ తనను తను బండగా మార్చుకున్న జయ కళ్ళు చెమ్మగిల్లాయి.

"దీనికి పెళ్ళి చేసెయ్యాలి-" మామూలుగా అందరూ అనుకున్నట్లే అనుకుని తన ఆలోచనకు తనే ఉలికిపడింది. పెళ్ళి చేస్తే రక్షణ ఉంటుందా? బాధ్యత తీరిపోతుందా?

చీకటి చిక్కబడుతోంది. బయటి వాతావరణంలో చీకటి దీపం పెడితే పోతుంది కాని, మనసులో పేరుకొనే చీకటి ఎలా పోతుంది? అక్కడ చెలరేగే రాక్షస ప్రవృత్తులను ఏ వెలుగులు తరిమికొట్టగలవు?

"అమ్మా! నాన్నకొచ్చే విలువయిన బహుమతి ఏమిటి?" అడిగింది కూతురు.

ఆ 'బహుమతి' గురించి రోజుకి పదిసార్లయినా గర్వంగా చెప్పుకుంటాడు దళపతి.

"నీ పని నాకెంతో నచ్చింది. త్వరలోనే నీకు విలువైన బహుమతి ఇస్తాను అన్నాడు, మా బాస్..." అంటూ ఉంటాడు.

ఆ బహుమతి ఏమిటని అడగలేదు జయ.

ఆడవాళ్ళతో ఆలోచనలు జరిపే వంశం కాదు, అతనిది. దళపతి దృష్టిలో ఆడవాళ్ళు పిల్లల్ని కనటానికీ, ఇంటి పని చెయ్యటానికీ మాత్రమే ఉన్నారు.

ఆ రాత్రి దళపతి ఇంటికి రాలేదు.

అలా రాకపోవటం జయకి అలవాటే! ఇంటి నిండా తొమ్మిది మంది పిల్లలూ, గోల చేస్తున్నారు. అది చాలదన్నట్లు ఉయ్యాల్లో పసివాడు, -పాలు తాగినా, నిద్ర రాక- తోచక- ఏడుస్తున్నాడు. కూతురు ఉయ్యాల ఊపుతూ తన పాఠాలే పైకి చదువుతోంది. పసివాడు అవన్నీ తనతో కబుర్లనుకుని "ఊ" కొడుతున్నాడు. జయ నవ్వుకుంది. అవసరానికి ఉపాయాలు అవే స్ఫురిస్తాయి.

జయ అలవాటుగా ఉదయం అయిదింటికి లేచి, వంట పనులు ప్రారంభించింది. వీధిలో జీప్ ఆగిన చప్పుడయితే, ముందు వరండాలోకి వచ్చింది. బలహీనంగా ఉన్న పదహారేళ్ళ అమ్మాయి జీప్ దిగింది. వెనకే దళపతి దిగాడు.

జయని గర్వంగా చూసాడు.

"నువ్వు పిల్లల్ని కన నన్నావుగా! నీకు పిల్లల్ని కనటానికి కొనుక్కొచ్చాను. నాకింకా కనీసం ఇరవై మంది పిల్లలు కావాలి. నా ఇంట్లోనే ముప్పైమంది ఓటర్లు!"

21-వ శతాబ్దిలో ఎంత ఘనత వహించిన భావాలు! ఎంత ప్రగల్భంగా చెప్పుకొంటున్నాడూ? "కంటావ్?, ముప్పై మందినీ, యాభై మందినీ, వాళ్ళందరినీ, ఎలా పెంచుతావ్?"

అరిచింది.

అరుపులకి పిల్లలంతా లేచి వరండాలోకి వచ్చారు. పిల్లల్ని చూసి మరీ, రెచ్చిపోయాడు, దళపతి.

"నాకేం కష్టమే! అన్నీ గవర్నమెంటే చూసుకుంటది. స్కూల్లో రిజర్వేసను. కాలేజీల్లో రిజర్వేసను. ఉద్యోగాల్లోనూ, రిజర్వేసనే! ఆపైన నా బాసున్నాడు." "నీకెవరిస్తారు, రిజర్వేషన్? రిజర్వేషన్ దొరికే కులమా, నీది?"

"కులమెవడికి కావాలే! నేను దళపతిని. నా తర్వాతనే ఏ కులమయినా? ఎలాంటి సర్టిఫికేట్ కావాలో చెప్పు క్షణాల్లో పుట్టిస్తాను."

మాట్లాడలేక గోడకి జార్లగిలబడింది జయ. పెద్ద కొడుకు దూసుకుపోతున్నట్లు బయటికి వెళ్ళాడు.

పిల్లలు జయ చేసిన ఇడ్లీలు పచ్చడితో ప్లేట్లలో పెట్టుకొని "వేడుక" చూడటానికి వరండాలోకి వచ్చారు.

"ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నావా? చేసుకోబోతున్నావా?"

అడిగింది జయ.

"రెండూ కాదు. పది మందిని కన్నాక పంపేస్తాను. ఆ తర్వాత మరొకతె వస్తుంది."

చిద్విలాసంగా అన్నాడు. జయ నిర్ఘాంతపోయింది. కొత్త అమ్మాయి వైపు చూసింది. ఆ అమ్మాయి ఈ సంభాషణ పట్టించుకోకుండా, ఆకలిగా జయ పిల్లల ప్లేట్లలోని ఇడ్లీలను చూస్తోంది.

జయకి గుండె మెలి పెట్టినట్లయింది. కూతురి వైపు చూసింది. ఆమె లోపలికి వెళ్ళి ప్లేట్లో ఇడ్లీలు, గ్లాసుతో

నీళ్ళు తెచ్చి ఇచ్చింది. ఆ అమ్మాయి ఆవురావురంటూ తింటోంటే, ఆ దృశ్యం చూడలేకపోయింది.

తూర్పున సూర్యోదయమవుతోంది.

సూర్యరథ సారధి అనూరుడు.

పరిపూర్ణాకృతి ఆవిష్కరించుకోని జీవశక్తిని ముందుంచుకొని, ఆ కాంతి కిరణాలు లీనం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు, 'మిత్రుడు'.

స్టూలు మీద కూచున్న కొత్త అమ్మాయి కళ్ళు మెరిసాయి. జయ ఆశ్చర్యంగా తన చూపులతో కొత్త అమ్మాయి చూపులను అనుసరించింది. దళపతి పెద్దకొడుకు- కం- కాబోయే ఓటరు-కం- కాబోయే ఉప దళపతి -తండ్రిని కొర కొర చూస్తూ బండరాతి మీద కత్తిని సర్రున నూరుతూ పదును పెడ్తున్నాడు. ఆ అమ్మాయి జయ కొడుకుని చూడటం లేదు. కొత్త వెలుగులతో కత్తి మెరుపుల్ని చూస్తోంది.

యుగ యుగాలుగా సాగుతోన్న చరిత్ర చమక్కులు! జయ రెండో కొడుకు చెల్లెల్ని ఇంట్లోంచి సైగచేసి పిలిచాడు. ఆమె వెళ్ళింది. చెల్లెలికి ఒక కాగితం చూపించాడు. సైగతోనే చెల్లికి ఏంచెయ్యాలో చెప్పాడు. ఆమె వెళ్ళి కొత్త అమ్మాయిని లోపలికి తీసుకొచ్చింది. తన చేతిలో కాగితం చూపించి అన్న వెంట వెళ్ళమని సైగ చేసింది. అతడు దొడ్డిగుమ్మం వైపు నడిచాడు. ఆ అమ్మాయి అనుసరించింది. కొన్ని క్షణాల్లో హీరో హోండా బయలుదేరిన చప్పుడు వినిపించింది.

జయ ఇదంతా గమనిస్తోనే ఉంది. తన పిల్లలకి తెంపరితనంలో, మొండితనంలో, సాహసంలో, తండ్రి పోలికే! కానీ, ఇది మరో కోణం. ఒకే గుణాలు సందర్భాలు మారినప్పుడు, ఎన్నెన్ని కోణాల్లో కనిపిస్తాయి?

దళపతి తన ఇంట్లోనే పిల్లల రూపంలో ఓటర్లని ఎలా పెంచుతాడో, అందువల్ల తనకు బాస్ నుండి వచ్చే విలువయిన బహుమతి ఎంత గొప్పగా ఉంటుందో, లెక్చర్ దంచుతూనే ఉన్నాడు. కొడుకు కత్తి నూరటం పూర్తయింది. సూర్యకాంతిలో అది ధగధగ మెరుస్తోంది.

తండ్రి దగ్గిరగా వచ్చాడు.

"నాన్నా! రాజుగారు- అదే, రాజకీయ నాయకుడు నన్ను కొత్త దళపతిగా చేసాడు, -మా కాలేజి కుర్రోళ్ళ ఓట్లన్నీ అటు మళ్ళించటానికి లే!..." ముందుకు కదలబోయాడు, కొడుకు.

తండ్రి మొదటి స్థాణువయి అంతలో కోపంగా కొడుకు మీదకు దూకబోయాడు. కొడుకు కత్తి ఎత్తాడు.

చెట్ల మీది పక్షులన్నీ "శభాష్!" శభాష్ అన్ని రకరకాల ధ్వనులతో అభినందిస్తూ ఎగిరిపోయాయి.

"అమ్మని కాని, చెల్లిని కాని కొట్టావంటే, జాగ్రత్త?" తండ్రిని తప్పుకుంటూ వెళ్ళి జీప్ స్టార్ట్ చేసాడు కొడుకు. కొడుక్కి జీప్ డ్రైవ్ చెయ్యటం తండ్రి స్వయంగా నేర్పాడు.

జయని ఉరిమి చూడబోయాడు దళపతి. కానీ, అతడి శక్తులన్నీ ఎవరో లాగేసినట్లు దబ్బున కూలబడ్డాడు.

జయలో విరక్తి తప్ప ఏ స్పందనా మిగల లేదు.

ఈ విష వృక్షాన్ని ఎవరు ఎందుకు పెంచి పోషిస్తున్నారు? ఈ విష వాయువుల నుండి తన పిల్లల్ని కాపాడుకోగలదా?

కింద కూలబడ్డ దళపతి పులిలా లేచి జయ గొంతు పట్టుకుని "ఇదంతా నువ్వే చేసావు. దాన్ని ఎక్కడకు



దళపతి తన ఇంట్లోనే పిల్లల రూపంలో ఓటర్లని ఎలా పెంచుతాడో, అందువల్ల తనకు బాస్ నుండి వచ్చే విలువయిన బహుమతి ఎంత గొప్పగా ఉంటుందో, లెక్చర్ దంచుతూనే ఉన్నాడు. కొడుకు కత్తి నూరటం పూర్తయింది. సూర్యకాంతిలో అది ధగధగ మెరుస్తోంది.

పంపావో చెప్పు. నిన్ను చంపేస్తాను. పిల్లల్ని కనకపోయాక నువ్వు బతికితే నేం? ఛస్తేనేం?" అని గాండ్రించాడు.

కొడుకుని ఎదుర్కోలేని అహం అసహాయురాలిపైన నిప్పులు కక్కుతోంది.

"నేను చెప్తాను."

వెనుక నించి ఒక స్వరం వినిపించింది.

జయ గొంతు మీది దళపతి చెయ్యి జారిపోయింది. అటు తిరిగాడు.

బెంగాల్ కాటన్ చీరలో పరమ నిరాడంబరంగా ఉన్న ఒకమ్మాయి ముఖంలో సంస్కారం ఉట్టిపడుతోంది. ఆమె వెంట పోలీసులు!

దళపతి ముఖంమీద బిగుసుకున్న తోడేలు తొడుగు బీటలువారి భయం రేఖలు వానపాముల్లా పాకాయి.

"ఆ అమ్మాయి పని కావాలంటూ వచ్చింది." ఎవరూ అడక్కుండానే చెప్పాడు. ఎంత ఆరితేరిన క్రిమినల్ అయినా, భయం గుప్పెట్లో చిక్కుకుంటే, పరమ చవటలా మాట్లాడతాడు. పోలీస్ ఇన్స్పెక్టర్ నవ్వాడు-

"అన్ని విషయాలూ స్టేషన్‌లో చెప్దురుగాని, జీపెక్కండి-" అన్నాడు.

దళపతి బింకంగా "నేను రాను" అంటోనే సెల్‌ఫోన్ తీసి కొన్ని నంబర్లు నొక్కాడు.

"హలో సార్! ఇంటికాడికి పోలీసులొచ్చారు. కాస్త చూడండి-" అన్నాడు. అటు వైపు చెప్పింది విన్నాడు. పోలీస్ ఇన్స్పెక్టర్‌తో "మా సార్ నీతో మాట్లాడతారంట! మాట్లాడు" అని సెల్ ఇచ్చాడు. ఇన్స్పెక్టర్ బెదురుగా తనతో వచ్చిన యువతిని చూస్తూ "చెప్పండి-" అన్నాడు. అటువైపు మాటలు విని "ఆడోళ్ళకు సంబంధించిన కేసు సార్! మహిళా కార్యకర్తలు వచ్చారు." అన్నాడు. అటువైపు ఏం వినపడిందో ఇన్స్పెక్టర్ ముఖం వెలిగింది- "యస్ సార్! యస్. సార్!" అని సెల్ ఆఫ్ చేసాడు.

"మీరు స్టేషన్‌కి రండి. అక్కడ అన్ని విషయాలూ తేలతాయి-"అన్నాడు.

"నేను రాను!" అన్నాడు దళపతి. సహజమయిన దుడుకుతనంతో ఇన్స్పెక్టర్ మీదికి కత్తి ఎత్తబోయాడు. అతడు వెంటనే గురి చూసి పిస్టల్ పేల్చాడు. దళపతి నెత్తుటి మడుగులో కూలిపోయాడు.

అంతా క్షణాలలో...

దళపతి తన జేబులో మడత బాకు పిడికి ఉన్న తాళంచెవులు జయ ముందుకి విసిరాడు.

అదే అతడి చిట్టచివరి చర్య.

దళపతి జేబులో సెల్ మోగింది.

ఇన్స్పెక్టర్ తీసాడు.

"స్టేషన్‌కి రాలేదు సార్. ఆడి పని అయిపోయింది. తర్వాత కలుస్తాను."

ఆ మాటలు వింటోంటే జయ మనసులో ఏదో గంట మోగింది.

"నా బాస్ నాకు 'విలువయిన బహుమతి' ఇస్తానన్నాడు" అన్న దళపతి మాటలు ఇన్స్పెక్టర్ మాటల్లో కలిసిపోయి ప్రతిధ్వనించాయి ఆమె మనసులో! ★

## ఎస్కిమోల నమ్మకాలు

అంటార్కిటికా ప్రాంతంలో నివసించే ఎస్కిమోల నమ్మకాలు చాలా చిత్రంగా ఉంటాయి. వారిలో స్త్రీని వెన్నెల్లో ఒంటరిగా బయటకు వెళ్ళనివ్వరు. వారి దృష్టిలో చంద్రుడు పర పురుషుడితో సమానం. చంద్రుని వల్ల శీలం కోల్పోతుంది స్త్రీ అని వారి నమ్మకం. మృత శిశువుకు సమాధి చేసేప్పుడు శిశువు శరీరంతోపాటు కుక్క తలకాయను కూడా గోతిలో పూడుస్తారు. శిశువు మరణానంతరం జీవితానికి కుక్క కాపలా కాస్తుందని వారి విశ్వాసం. వీరికి వేటాడే ఓపిక నశిస్తే పెద్ద విందు చేస్తారు అందరికీ. వారందరి ఎదురుగానే ఆత్మహత్య చేసుకొంటారు.

దీపం ఆర్పే వేడుక పేరుతో నిర్వహించే ఓ ఉత్సవంలో భార్యలను మార్చుకొంటారు. గొప్ప వేటగాడు మరణిస్తే అతని శరీరాన్ని చిన్న చిన్న ముక్కలుగా నరికి ఆ ముక్కల్ని తమ బాణాలకు జిల్లేడాకు అంటిస్తారు. దీనివల్ల తాము గొప్ప వేటగాళ్ళమవుతామని వారి ఆశ. వీరిలో పురుషులు మాత్రమే వేటాడాలి.

ఒక కుటుంబంలో వరుసగా ఆడ లేదా మగ శిశువులు వరుసగా జన్మిస్తే వారిని హతమారుస్తారు. సూర్యుడు ఆరునెలల తర్వాత చీకటిలోకి పోగానే పెద్ద వేడుక నిర్వహిస్తారు.

**-కలపర్తి**

